జయహో.. జగన్మాత నమోస్తుతే


విజయదుర్గాదేవి ఊరేగింపు

శరన్నవరాత్రుల అనంతరం దసరా పండగను శనివారం జిల్లావ్యాప్తంగా భక్తులు వైభవంగా జరుపుకొన్నారు. అమ్మవారి ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తాడిపత్రిలో కన్యకాపరమేశ్వరి, యల్లనూరు రోడ్డులోని విజయచౌడేశ్వరి ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి


ఆలయం వద్ద కలశాలతో మహిళలు

పండగైనా.. పనిచేయాల్సిందే

ఏఎంసీలో మార్కెటింగ్‌శాఖ అధికారుల తీరుపై సిబ్బంది ఆవేదన

అనంత మార్కెట్‌యార్డు, న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో(ఏఎంసీ) పండగైనా పని చేయాల్సిందే. ఇక్కడ మార్కెటింగ్‌శాఖ అధికారుల ధోరణి మారకపోవడంతో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యార్డులో ప్రతి శనివారం గొర్రెలు, మేకల సంత, ఆదివారం పశువుల సంత జరుగుతుంది. శనివారం దసరా పండగ ఉందని, సంతలకు సెలవు ఇవ్వాలని పైఅధికారిని సిబ్బంది అడిగారు. తన చేతుల్లో ఏమి లేదని ఆయన చెప్పారు. శని, ఆదివారాల్లో సంతలు నిర్వహించడంతో ఒక్కరు కూడా సంతోషంగా లేరు. అధికారుల తీరుపై మండిపడ్డారు. గతంలో సంతల రోజు పండుగలొస్తే సెలవులు ఇచ్చేవారని, ఐదేళ్లుగా అధికారులు సెలవులు ఇవ్వకుండా సతాయిస్తున్నారని సిబ్బంది వాపోయారు. ఈ విషయాన్ని ఓ అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పండగైనా పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు.

సంతలకు తగ్గిన ఆదాయం: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని వారం సంతలకు దసరా పండగ దెబ్బ పడింది. గత వారాల కంటే ఈ వారం ఆదాయం తగ్గింది. ఈనెల 12, 13వ తేదీల్లో జరిగిన సంతల్లో మొత్తం రూ.3,45,200 ఆదాయం వచ్చింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ.2.15 లక్షలు, పశువుల సంతలో రూ.1,30,200 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

ఫోర్టో రాష్ట్ర అధ్యక్షుడిగా హరికృష్ణ


హరికృష్ణ


కొండయ్య

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫోర్టో) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అంకాల కొండయ్య, గౌరవాధ్యక్షులుగా వెంకటరెడ్డి, ముఖ్య సలహాదారుడుగా ధనుంజయరావు, కోశాధికారిగా శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శిగా రమేశ్, సహాధ్యక్షులుగా శ్రీనివాసరావు, విజయలక్ష్మి, దుర్గారావు, కరీముల్లా, సంయుక్త కార్యదర్శులుగా బీరప్ప, పెద్దన్న, శివశంకర్‌రెడ్డి, ఈరాలప్ప, వెంకటరమణమూర్తి, శ్రీహరికోటి యోహాన్ ఎంపికయ్యారు.

ప్రమాదం.. వంతెనపై ప్రయాణం


రక్షణ గోడలు లేని వంతెన మార్గం

యాడికి, న్యూస్‌టుడే : నిట్టూరు-యాడికి రహదారి మధ్య ఉన్న వంతెన వాహనదారులను వణికిస్తోంది. వంతెనకు ఇరుపక్కల ఎటువంటి రక్షణ గోడలు లేకపోవడంతో భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ మార్గంలో రోజుకు వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. వంతెన పైన రోడ్డు దెబ్బతిని, గుంతలు ఏర్పడ్డాయి. వీటిని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు 15 అడుగుల లోతులో కిందకు పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో వివిధ వాహనాలు అదుపుతప్పి వంకలో పడటం, ఆ ఘటనల్లో పలువురు గాయాలపాలవటం జరిగాయి. రక్షణ గోడలు నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు. త్వరలోనే రక్షణ చర్యలు చేపడతామని రహదారులు, భవనాల శాఖ ఏఈ హనీఫ్ చెప్పారు.

నిర్వహణ గాలికొదిలి..
నిర్వీర్యం చేశారు

- వ్యవసాయ శిక్షణ కేంద్రాలను ఐదేళ్లూ విస్మరించిన వైకాపా ప్రభుత్వం
- కూటమి సర్కారు పునరుద్ధరిస్తే పూర్వ వైభవమే

అనంతపురం వ్యవసాయం: అన్నదాతల బాగు కోసం ఉమ్మడి అనంత జిల్లాలో వ్యవసాయశాఖలో కొన్ని దశాబ్దాల కిందటే శిక్షణ కేంద్రాలు నెలకొల్పారు. వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు, రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంతోమందిని ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దాయి. రైతులకు అనేక మెలకువలు నేర్పించి పంటల సాగులో ఉత్తమ రైతులుగా గుర్తింపు తెచ్చాయి. ఏటా వందలాది శిక్షణ కార్యక్రమాలు జరిగేవి. గత వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణను గాలికొదిలేసి నిర్వీర్యం చేసింది. ఒక్క శిక్షణ కూడా ఇవ్వలేదు. దీంతో అవన్నీ మూతపడ్డాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వీటిని పునరుద్ధరిస్తే వ్యవసాయశాఖకు పూర్వవైభవం వస్తుందని రైతులు, అధికారులు కోరుతున్నారు.


భూసార సంరక్షణ శిక్షణ కేంద్రం

రాష్ట్రంలో ఏకైక భూసార సంరక్షణ శిక్షణ కేంద్రం ఇది. నగరంలోని ప్రసన్నాయపల్లి వద్ద విశాలమైన ప్రాంతంలో నెలకొల్పారు. రాష్ట్రంలో కొత్తగా నియమించిన వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం చెక్‌డ్యామ్‌లు, నీటికుంటలు, రాతి కట్టడాలు, గులకరాళ్ల కట్టలు, కలబంధ పెంపకం వంటివి నిర్మించారు. వీటిని ప్రత్యక్షంగా చూపించి శిక్షణ ఇచ్చేవారు. శిక్షనార్థులకు వసతి కల్పించారు. వందలాది చెట్లు పెంచి ఆహ్లాద వాతావరణం ఏర్పాటు చేశారు. ఇంతటి పేరున్న కేంద్రాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. 19 పోస్టుల్లో 6 ఖాళీగా ఉండగా, మిగిలిన 13 పోస్టుల్లో ముగ్గురు మాత్రమే ఉన్నారు. 10 మందిని ఇతరచోట్ల డెప్యూటేషన్‌పై పంపింది.


మూసేసిన రైతు శిక్షణ కేంద్రం

ఇది ఉమ్మడి జిల్లా రైతు శిక్షణ కేంద్రం. ఖరీఫ్, రబీ సీజన్ల వారీగా ఏటా ఆయా పంటల సాగు, పురుగులు, తెగుళ్ల నివారణపై రైతులు, ఏవోలు, ఏడీఏలు, ఏఈవోలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేవారు. అందుకు ప్రత్యేక బడ్జెట్ ఇచ్చేవారు. వీటితోపాటు పొలంబడులు, పొలం పిలుస్తోంది అన్న కార్యక్రమాలను క్షేత్రస్థాయి పొలాల్లో నిర్వహించేవారు. పొలాల్లో రైతు పద్ధతి, సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతుల్లో పంట తేడాను గుర్తించి రైతులకు తెలియజేసేవారు. వైకాపా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని పూర్తిగా మూసేసింది. 12 మంది అధికారులు, ఉద్యోగుల్లో ముగ్గురు డెప్యూటేషన్‌పై ఉన్నారు. మరో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.


డీఆర్‌సీ కేంద్రంలో ఆత్మా కార్యాలయం

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) భవనమిది. ఉమ్మడి జిల్లా రైతుల కోసం నెలకొల్పారు. వ్యవసాయశాఖ మాదిరిగా ఆత్మాకు వ్యవసాయ సంయుక్త సంచాలకులు (జేడీఏ), డీపీడీ, ఏడీఏ, ఏవో, కంప్యూటర్ ఆపరేటర్, సీనియర్ సహాయకుడు ఉండేవారు. ఏటా ప్రత్యేక బడ్జెట్ వచ్చేది. వ్యవసాయ, అనుబంధశాఖలకు వివిధ అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు ఖర్చు పెట్టేవారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శనలకు తీసుకెళ్లేవారు. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించేవారు. వైకాపా ప్రభుత్వం ఆత్మాతో పాటు జేడీఏ పోస్టును ఎత్తేసింది. జిల్లా రిసోర్సు సెంటర్(డీఆర్‌సీ) ఏర్పాటు చేసి ఆత్మాను కలిపేసి నిర్వీర్యం చేసింది.

నివేదికలు తెప్పించుకుంటాం
- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారిణి

భూసార సంరక్షణ, రైతు శిక్షణ కేంద్రాలు, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) విభాగాలకు సంబంధించిన నివేదికలు తెప్పించుకుంటాం. గతంలో ఏయే కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఏం జరుగుతున్నాయన్న వాటిపై సమగ్ర నివేదికను తెప్పించుకుని పునరుద్ధరణ అవకాశాలు పరిశీలిస్తాం.

కాసులకు కక్కుర్తిపడి.. ప్రజల ఆస్తి పరులపాలు

- గుత్తి రెవెన్యూ కార్యాలయంలో దస్త్రాల నిర్వహణ అస్తవ్యస్తం
- ఒకరి పొలం మరొకరి పేరుతో మార్పులు

గుత్తి, న్యూస్‌టుడే: కాసులిస్తే చాలు.. ఎవరి స్థిరాస్తినైనా అప్పనంగా ఇతరులకు రాసిస్తున్నారు కొందరు రెవెన్యూ అధికారులు. గుత్తి రెవెన్యూ కార్యాలయంలో దస్త్రాలు అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నారు. ఒకరి భూమిని మరొకరి పేరుతో యథేచ్ఛగా రాసిస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూములను ఇతరులకు ధారాదత్తం చేస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులు లబోదిబోమంటున్నారు. ఏళ్లతరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు వాపోతున్నారు. సరిచేసేందుకు కూడా కొందరు వీఆర్‌వోలు లంచాలు అడుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. గుత్తిలో ప్రజా ఆస్తులకు రక్షణ కరవవుతోంది.


తమ పొలాన్ని ఇతరుల పేరున మార్చేశారని చూపుతున్న ధర్మాపురానికి చెందిన బాలరంగన్న కుటుంబీకులు

ఎక్కడెక్కడంటే..

✦ గుత్తి మండలంలోని ధర్మాపురానికి చెందిన బాలరంగన్న పేరుతో 2000లో సర్వేనంబరు 5బీ-2లో ప్రభుత్వం 4.30 ఎకరాల భూమి ఇచ్చింది. ఆ భూమిని అధికారులు ఇతరుల పేర్లతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. బాలరంగన్న ఏడాది కిందట అనారోగ్యంతో మరణించారు. ఆయన కుమారుడు కూడా మృతి చెందారు. ప్రస్తుతం ఆయన కోడలు, మనవడు తమపేర పాసుపుస్తకాలు మంజూరు చేయించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ, ఆ భూమి గ్రామానికి సంబంధం లేని రంగమ్మ, వెంకటరమణమ్మల పేర్లపై ఉంది. ఇది తెలుసుకున్న బాలరంగన్న వారసులు తమకు న్యాయం చేయాలని ఇటీవల అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

✦ పెద్దొడ్డిలో అనగానదొడ్డికి చెందిన లక్ష్మీదేవికి పదేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వం భూకొనుగోలు పథకం కింద ఆలయ భూమిని కొనుగోలు చేసి రెండు ఎకరాలు ఇచ్చింది. లక్ష్మీదేవి కొన్నేళ్లపాటు పొలాన్ని సాగుచేసుకుంటూ ఉండేది. వర్షాలు సక్రమంగా లేక పంటలు పండకపోవడంతో అప్పులపాలైంది. దీంతో తన మరిదికి సాగుకు భూమి ఇచ్చి కడపలో కూలీ పనులకు వలస వెళ్లింది. ఇదే అదునుగా భావించిన లక్ష్మీదేవి మరిది వీఆర్‌వో చేతులు తడిపి తన పేరును వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించుకున్నాడు.

✦ గుత్తి చెందిన జీఎం బాషాకు సర్వేనెంబరు 222లో 50 సెంట్ల భూమి తన పూర్వీకుల నుంచి సంక్రమించింది. ఈ భూమిని రెవెన్యూ అధికారులు ఇతరులకు ధారాదత్తం చేశారు. భూమిని తనపేరున రాసి ఇవ్వాలని మూడేళ్ల నుంచి ఆయన అధికారుల చుట్టూ తిరగుతున్నాడు. డీఆర్వో కోర్టులో బాషాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. స్థానిక అధికారులకు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకుని 45 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆమోదించడం లేదు.

✦ కరిడికొండ వద్ద టి.కొత్తపల్లికి చెందిన బందెన్న అనే రైతుకు 2.30 ఎకరాల భూమి ఉంది. దీనిని బాచుపల్లికి చెందిన ఓ రైతు పేరుతో రికార్డుల్లో నమోదు చేశారు. భూమిని తనపేరుతో భూ రికార్డుల్లో ఎక్కించాలని బందెన్న అధికారులను మూడేళ్ల నుంచి కోరుతున్నాడు. అధికారులు చూస్తాం.. చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు.

సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాం
- ఓబులేశు, తహసీల్దారు, గుత్తి

వెబ్‌ల్యాండ్‌లో ఒకరి భూమి మరొకరి పేర్లతో ఉన్నవాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఏళ్లనాటి సమస్యలైనందున నాకు సమయం పడుతుంది. వారం తరువాత రికార్డులను పూర్తిగా పరిశీలిస్తాం. ఒకరి భూమి మరొకరి పేర్లతో ఉన్నవాటిని గుర్తించి నోటీసులు ఇస్తాం.

17న అనంతలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: అనంతపురంలో రాష్ట్రస్థాయి మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అధికారికంగా వాల్మీకి జయంతి నిర్వహిస్తామని, అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ప్రభుత్వమే భరిస్తుందని అనంతపురం జిల్లాలో నిర్వహించిన యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ వాల్మీకులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈనెల 17న వాల్మీకి జయంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని బీసీ సంక్షేమశాఖ ప్రభుత్వ కార్యదర్శి పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్వహణకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. అనంతపురం నగరంలో వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది సోమవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, కలెక్టరు వినోద్‌కుమార్, వాల్మీకి కులపెద్దలు, నేతలు పరిశీలించి ఎంపిక చేయనున్నారు.

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు): వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను కలిసి విన్నవించామని బోయ, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజు, వాల్మీకి సంఘాల నాయకులు తెలిపారు. తమ విజ్ఞప్తి మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 17న వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.


వీక్షణ సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు

భారీ వర్షాలు ఉన్నాయి.. జాగ్రత్త!

జిల్లా అధికారులకు కలెక్టర్ నిర్దేశం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎక్కడికక్కడ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో వీక్షణ సమీక్ష జరిపారు. జిల్లా స్థాయిలోనే కాదు.. మండల స్థాయిలోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి సంబంధిత నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. తూర్పు మధ్య అరేబియా సముద్రం మీదుగా అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఈనెల 14 నుంచి 16వ తేదీ మధ్య జిల్లాలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. మండల స్థాయిలో ఎప్పటికప్పుడు తగిన నివేదిక పంపాలన్నారు ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగడానికి వీలులేదన్నారు. విద్యుత్తు స్తంభాలు పడిపోతే సత్వరమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో జేసీ శివనారాయణ శర్మ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల టెండర్ల లాటరీ నేడే

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ప్రైవేటు మద్యం దుకాణాలకు లాటరీ తీసే ప్రక్రియను సోమవారం నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లాలో 136 దుకాణాలకు గాను 3,261 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుము కింద ప్రభుత్వానికి రూ.65.22 కోట్లు సమకూరింది. ఉదయం 8 గంటలకు నగరంలోని జేఎన్టీయూలో ఎన్టీఆర్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియ నిర్వహిస్తారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా ఉన్నతాధికారులు పూర్తి చేశారు. దరఖాస్తుదారులు కూర్చోవడానికి ప్రత్యేకమైన వరుసల్లో కుర్చీలు ఏర్పాటు చేశారు. ప్రక్రియ మొత్తం వీడియో తీస్తారు. అలాగే లాటరీలో లక్కీ డ్రా ద్వారా దుకాణాలు దక్కించుకున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి పెద్ద వీడియో స్క్రీన్ ఏర్పాటు చేశారు. కాగా ఈ ప్రక్రియకు సంబంధించి ఎక్సైజ్ సిబ్బందితో మాక్ టెండరింగ్ నిర్వహించారు. ఇందుకు ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 29 మంది ఎస్సైలు, 300 మంది పోలీసులను బందోబస్తుకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

✦ దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుడికి అధికారులు క్యూఆర్ కోడ్‌తో ఇచ్చిన రిసిప్ట్‌ను చూపించి లాటరీలో పాల్గొనాలి. దరఖాస్తు చేసిన వారందరినీ వేదికపై కూర్చోబెట్టి వారి సమక్షంలోనే లక్కీ డ్రా తీస్తారు. మొదట కన్‌ఫర్మ్ దరఖాస్తుదారుడిని, ఆ తర్వాత రెండు లేదా మూడు రిజర్వ్ దరఖాస్తుదారుల లక్కీ డ్రా తీస్తారు.

ఉపకులపతుల నియామకానికి వేళాయె..

సెర్చ్ కమిటీ ప్రతినిధి ఎంపికపై ఉత్కంఠ


శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అనంత జిల్లాలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ఉన్నాయి. ఆ రెండు వర్సిటీల్లో ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఉపకులపతులు కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ఇన్‌ఛార్జి ఉపకులపతులను నియమించింది. జులై 18న ఎస్కేయూ, జేఎన్‌టీయూలకు ఇన్‌ఛార్జి వీసీలు నియమితులయ్యారు. సుమారు 3 నెలలుగా ఇన్‌ఛార్జిల పాలన కొనసాగుతోంది. రెగ్యులర్ వీసీల నియామకానికి ఉన్నత విద్యామండలి దరఖాస్తులు స్వీకరించింది. పలువురు ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు దరఖాస్తు చేసుకొన్నారు.

వారి సూచనలే కీలకం..

వీసీల ఎంపికకు సెర్చ్‌కమిటీ సూచనలు ఇస్తుంది. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీ ఒకరిని, ప్రభుత్వం ఒకరికి, వర్సిటీ పాలకమండలి ఒక అభ్యర్థిని ప్రతిపాదిస్తారు. ఆ ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ దరఖాస్తులను పరిశీలిస్తుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలన బృందం వడపోత పోస్తారు. ఆచార్యుల అనుభవం, నైపుణ్యాలు, పరిశోధనలు, ప్రచురణలు తదితర అంశాలను పరిశీలించి ఉన్నత విద్యామండలికి సూచనలు ఇస్తారు. అనంతరం గవర్నర్ ఉపకులపతులను నియమిస్తారు. ఈ నియామకాలు డిసెంబరులో పూర్తి చేసే అవకాశముందని వర్సిటీ అధికారులు, ఆచార్యులు భావిస్తున్నారు.

25లోపు సభ్యుడిని ప్రతిపాదించాలి

ఈనెల 25వ తేదీలోపు విశ్వవిద్యాలయాలు సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును ప్రతిపాదించాలని ఉన్నతవిద్యామండలి నుంచి వర్సిటీలకు ఆదేశాలు వచ్చాయి. అప్పటిలోపు విశ్వవిద్యాలయాలు పాలకమండలి సమావేశంలో సభ్యుడి పేరును తీర్మానం చేయాలి. కేవలం 12 రోజులు మాత్రమే గడువుంది. దీంతో ఉత్కంఠ నెలకొంది. పాలకమండలి సూచించే సభ్యుడు సీనియర్ ఆచార్యులై ఉంటారు. స్థానిక వర్సిటీలోని ఆచార్యుడు కాకుండా ఇతర విశ్వవిద్యాలయాల ఆచార్యులను పాలకమండలి సభ్యుడిగా నియమించాలి. ఇతర వర్సిటీల్లో అనుభవం, ప్రతిభ కలిగిన ఆచార్యుణ్ని ఎంపిక చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సౌరభ్‌గౌర్ సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి కోనశశిధర్‌ను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. ఆయన అనుమతి మేరకు పాలకమండలి సమావేశాలు నిర్వహిస్తామని ఎస్కేయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అనిత, జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శనరావు తెలిపారు.



జేఎన్‌టీయూ ముఖద్వారం

ముమ్మర ప్రయత్నాలు

వీసీ పదవుల కోసం ఎస్కేయూ, జేఎన్‌టీయూలోని పలువురు ఆచార్యులు దరఖాస్తు చేశారు. ఇందులో కొందరు విశ్రాంత ఆచార్యులు కూడా ఉన్నారు. ఉపకులపతి పదవి దక్కించుకొనేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో వర్సిటీ నుంచి సుమారు 10 మంది వరకూ ఆశావహులు ఉన్నట్లు సమాచారం. కొందరు ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న ఆచార్యులు కూడా ఉన్నారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా జేఎన్‌టీయూలోని మెకానికల్ విభాగానికి చెందిన ఓ ఆచార్యుడు ఉండేవారు. ఆయన ఇటీవల పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆ పదవిలో కూడా ఇన్‌ఛార్జి ఛైర్మన్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో కీలకమైన నిర్ణయాల్లో ఛైర్మన్ ప్రమేయం ఉంటుంది. కీలకమైన ఛైర్మన్ పదవి కోసం ఎస్కేయూ, జేఎన్‌టీయూ ఆచార్యులు పోటీపడుతున్నట్లు సమాచారం.



సూర్యప్రభ వాహనంపై కొలువుతీరిన స్వామి

వైభవంగా చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం యథావిధిగా కొనసాగాయి. చింతలరాయుడిని ప్రత్యేకంగా అలంకరించి శనివారం స్వామిని హంసవాహనంపై కొలుతీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో కూర్చోబెట్టి సీబీ రోడ్డు మీదుగా ఘనంగా ఊరేగించారు. ముందుగా స్వామికి అర్చనలు, అభిషేకాలు వంటి పూజలు నిర్వహించారు.

తిరుగు ప్రయాణానికి తిప్పలు

కిక్కిరిసిన రైళ్లు

అమరావతి ప్రయాణికులకు కష్టాలు..



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: దసరా పండగ ముగియడంతో స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం అయ్యారు. ఉద్యోగులు, విద్యార్థులు ఆదివారం ఒకరోజు ముందుగానే బయల్దేరారు. దీంతో రద్దీ మార్గాల్లో ప్రయాణం ప్రయాసగా మారింది. అనంతపురం నుంచి విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి మార్గాల్లోని రైళ్లలో నిల్చోవడానికి చోటు దొరకని పరిస్థితి. విజయవాడకు వెళ్లాల్సిన ఎక్కువ మంది రైలు ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తారు. టికెట్టు ధర తక్కువగా ఉండటంతో పాటు దూర ప్రయాణంలో అలుపు లేకుండా చేరుకోవడానికి వీలవుతుంది. దీంతో ఎక్కువ మంది రైళ్లపైనే ఆధారపడ్డారు. ఈ మార్గంలో ఒక్క ప్రత్యేక రైలును దసరా సందర్భంగా రైల్వే శాఖ నడిపించలేదు. కేవలం కలబురగి(గుల్బర్గా) నుంచి బెంగళూరుకు(06522) రైలును ఒక రోజు నడిపారు. ఈ రైలు ఆదివారం తెల్లవారుజామున బెంగళూరుకు వెళ్లి తర్వాత తిరిగి కలబురగి వెళ్లింది. ఈ మార్గంలో పెద్దగా రద్దీ లేకపోవడంతో ఆశించిన ప్రయోజనం లేకపోయింది. విజయవాడ-బెంగళూరు మార్గంలో ఒక ప్రత్యేక రైలు నడిపి ఉంటే ప్రయాణికులకు ఊరట లభించేది.

ఆదివారం అనంతపురం నుంచి విజయవాడకు వెళ్లడానికి ధర్మవరం - మచిలీపట్నం(17216), బెంగళూరు సిటీ-భువనేశ్వర్(18464) రెండు రైళ్లు మాత్రమే ఉన్నాయి. గతంతో బెంగళూరు దండు- విజయవాడ(56503/04) ప్యాసింజర్ రైలు ఉన్నా అది కరోనా తర్వాత పట్టాలు ఎక్కలేదు. విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంది. సెలవు రోజుల్లో సుమారు 15 వేల మంది ఉద్యోగులు అటు.. ఇటు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక అమరావతిలో సుమారు 15 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా సెలవులు ముగియగానే రైళ్లెక్కాల్సిందే. వీరితో పాటు ప్రైవేటు సంస్థల్లో పని చేసే సిబ్బంది సుమారు 7,500 మంది ఉన్నట్లు అంచనా. మరీ వీరందరికీ ఒకే రోజు ప్రయాణానికి సీటు దొరకాలంటే అతి కష్టంగా ఉంది. కనీసం ప్యాసింజర్ రైలు ఉంటే కర్నూల్ని ఎలాగో ప్రయాణాన్ని సాగించేవారు. ఆ రైలు కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడకు వెళ్లాల్సిన వారు ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకుని ప్రయాణాలు సాగించారు.



రైలు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

హైదరాబాద్, ముంబయి మార్గాలకు డిమాండు

జిల్లావాసులు ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరుకు వలస వెళుతుంటారు. వారంతా సెలవు రోజుల్లో ప్రయాణం సాగించడం కష్టంగా మారుతుంది. ఇటీవల హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల సంఖ్య కొంత తగ్గింది. దీనికితోడు ఆ మార్గంలో వెళ్లే రైళ్ల సంఖ్య పెరిగింది. రోజూ మూడు నుంచి ఐదు రైళ్లు హైదరాబాద్ వైపు వెళుతున్నాయి. వందే భారత్ రావడంతో ఉద్యోగులు ఈ రైలుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఇటీవల చెన్నైలో ఇంజినీరింగ్ చదవడానికి అనంత విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దీంతో చెన్నై మార్గంలోనూ డిమాండు పెరిగింది. ముంబయి వైపు వెళ్లే ప్రయాణికులు అధికంగా ఉండటంతో ఈ మార్గంలోనూ డిమాండు పెరిగింది. ఈ మార్గాల్లో కనీసం మూడు నెలల ముందుగా రిజర్వేషన్ చేసుకోకపోతే సీటు దొరికే పరిస్థితి లేదు. బెంగళూరు- కలబురగి మధ్య నడిచే వందే భారత్ రైలును ముంబయి వరకు పొడగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అనంతపురం రైల్వే స్టేషన్ మీదుగా రోజూ సగటున 5 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 8,500 మంది రాకపోకలు సాగించినట్లు అంచనా.



హనుమ వాహనంపై ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

భక్తిశ్రద్ధలతో నెట్టికంటయ్య ప్రాకారోత్సవం

గుంతకల్లు గ్రామీణం : కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో దేవిన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్ల ఉత్సవమూర్తులను హనుమంత వాహనంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో విశాలాక్షి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సూక్త విధాన పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి గ్రామంలోని జమ్మి చెట్టు వద్ద పూజ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, ఏఈఓ వెంకటేశులు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ అర్చకులు, వేదపండితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైకాపా నుంచి తెదేపాలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో గుండుమల

మడకశిర: వైబీహళ్లి గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు తెదేపాలో చేరారు. ఆదివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో వైకాపా నాయకులు తిమ్మేగౌడ, హనుమంతేగౌడ, శశికుమార్, రాధాకృష్ణ, రంగప్ప తదితరులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యకర్తలే మా కుటుంబానికి బలం : జేసీ



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే : కార్యకర్తలే తమ కుటుంబానికి బలమని, వారిని డబ్బులిచ్చి ఎవరూ కొనలేరని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తన ఇంటిపై దాడి చేసినప్పుడు అక్కడ తాను లేకపోయినా కార్యకర్తలే సమాధానం చెప్పారన్నారు. నాలుగు దశాబ్దాలుగా కార్యకర్తలే తమ కుటుంబానికి బలమని, వారివల్లే రాజకీయాల్లో రాణిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. వారికి ఏమైనా ఆపద వస్తే తాను ముందుంటానని అభయమిచ్చారు. ఐదేళ్ల పాటు శ్రమించిన కార్యకర్తలకు లబ్ధి చేకూరేలా చూస్తామన్నారు. పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తాని తరచూ చెబుతున్నాడని, అతను ఎవరితో ఫ్యాక్షన్ చేయలేడని, ఒక వేళ చేస్తే అతని కుమారులు, భార్య అతన్ని కొడతారని ఎద్దేవ చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం శ్రమిస్తానన్నారు. యల్లనూరు మండలంలోని పలువురు నాయకులు గతంలో వైకాపాలో ఉంటూ ఇప్పుడు తెదేపాలోకి వచ్చి లబ్ధిపొందాలని చూస్తున్నారని, అటువంటివి జరగవని ఆయన స్పష్టం చేశారు.

కవిత్వం యువకవులకు స్ఫూర్తినివ్వాలి



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు, రచయితలు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: కవిత్వం.. సరికొత్త అంశాలను మేళవించి యువ కవులను ఆలోచించే విధంగా రావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో కవి సమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో శ్రీనివాసం, రవ్వల సడి అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, శాంతి నారాయణ మాట్లాడుతూ వెంకట కృష్ణ రచించిన రవ్వల సడిలో రాయలసీమ సాహితీ విమర్శకు సంబంధించిన అంశాలు పొందు పరిచారన్నారు. 1952 నుంచి నేటి దాకా రాయలసీమలో వచ్చిన కవిత్వ సారాన్ని, రూపాన్ని తెలియజేస్తుందన్నారు. రాయలసీమ సాహిత్య విమర్శకు కొత్త చేర్పు అని కొనియాడారు. శ్రీనివాస్‌గౌడ్ రచించిన శ్రీనివాసం పుస్తకాన్ని సమీక్షిస్తూ తూముచెర్ల రాజారాం మాట్లాడుతూ వర్తమాన తెలుగు కవిత్వ భాషను, గాఢతను, ఇప్పుడు రాస్తున్న యువ కవుల ఆత్మను ఆవిష్కరిస్తుందన్నారు. కవుల కలలు వారి జీవితమంతా పరచుకున్న కన్నీళ్లు అందులో పరామర్శించబడ్డాయన్నారు. కార్యక్రమంలో అంకె శ్రీనివాస్, ఉర్దూ వర్సిటీ ఆచార్యులు రత్నాకర్, కొత్తపల్లి సురేష్, షేక్ నబీర సూల్, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

తెదేపా కన్వీనర్ చికిత్సకు

రూ.5 లక్షల విరాళం

మడకశిర : తెదేపా పట్టణ అధ్యక్షుడు మనోహర్ రెండు రోజుల క్రితం గుండె నొప్పి రావడంతో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు రూ.5 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే పీఏ ఆసుపత్రిలో అందజేశారు.



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే పీఏ రవికుమార్, నాయకులు

సెక్టోరియల్ ఉద్యోగాలపై సందిగ్ధం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఉద్యోగాలపై సందిగ్ధం నెలకొంది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలు నిర్వహించి 14 రోజులవుతోంది. ఫలితాలు ఇప్పటికీ వెల్లడించలేదు. మౌఖిక పరీక్షలకు అభ్యర్థుల ఎంపికలో ఆరోపణలు రావడంతో ఫలితాలు వెల్లడించడంలో జాప్యం జరుగుతుందని తెలుస్తోంది. అర్హత ఉన్నా తమకు మౌఖిక పరీక్షకు ఆహ్వానించలేదని ఇద్దరు అభ్యర్థులు వేరువేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరు అభ్యర్థులకు సమగ్రశిక్షా అధికారులు ఎండార్స్ పంపించారు. 7 రోజుల్లో ధ్రువపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. ఇందులో అవకతవకలు జరిగినట్లు ప్రజాప్రతినిధులు కూడా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేల ఫిర్యాదుకు స్పందిస్తూ కలెక్టర్ డీఈవో, ఏపీసీలపై విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో నియామకంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. సమగ్రశిక్షా పథకంలో ఖాళీగా ఉన్న ఏఎంఓ, జీసీడీవో, అసిస్టెంట్ ఏఎంఓ, అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంవో, ఐఈడీ, సీఎంఓ పోస్టులను ఫారిన్ సర్వీసు కింద భర్తీ చేయడానికి గత నెలలో ప్రకటన జారీ చేశారు. ఈ పోస్టులకు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే అర్హులు. 110 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల వడపోతలో 14 మాత్రమే సక్రమంగా ఉన్నాయని గుర్తించారు. వాటికి ఈ నెల 1న మౌఖిక పరీక్ష నిర్వహించగా 13 మంది మాత్రమే హాజరయ్యారు. రెండు మూడు రోజుల్లో నియామకాలు జరుగుతాయని అధికారులు చెప్పారు. ఇంతవరకూ ఫలితాలు వెల్లడించకపోవడంతో ఏం జరుగుతుందోనని విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఎండార్స్‌మెంట్ అందుకున్న ఉపాధ్యాయులు తమ ధ్రువపత్రాలు సమర్పించడానికి సిద్ధమవుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పనులు చేపట్టండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జలసాధన సమితి సభ్యులు

హిందూపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి కరవు భారి నుంచి కాపాడాలని జలసాధన సమితి సభ్యులు మంత్రి సవితను కోరారు. ఆదివారం మంత్రి హిందూపురం వచ్చిన సందర్భంగా జలసాధన సమితి సభ్యులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, సిద్దారెడ్డి తదితరులు మంతికి వినతిపత్రం అందించారు. హంద్రీనీవా నీటి ద్వారా ఉమ్మడి జిల్లాల్లో ఉన్న అన్ని చెరువులకు నీటిని నింపాలని కోరారు. హంద్రీనీవా కాలువలకు మరమ్మతు చేపట్టి నీరు వదిలితే చెరువులకు చేరుతాయన్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకొంటామన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పట్టణ పార్టీ అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్, కౌన్సిలర్ రాఘవేంద్రలు పాల్గొన్నారు.

మహిళా పోలీసు ఇంట్లో చోరీ

✦ 8.5 తులాల బంగారం, రూ.70 వేలు నగదు మాయం

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న మహిళా కానిస్టేబుల్ లావణ్య ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. దసరా పండగ కావడంతో లావణ్య కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం వెళ్లారు. తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకున్న చోరులు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి రెండు బీరువాలను పగులగొట్టారు. అనంతపురం నుంచి ఆదివారం ఇంటికి వచ్చిన కానిస్టేబుల్ లావణ్య ఇంట్లో దొంగలు పడిన విషయం తెలుసుకుని ధర్మవరం 2వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. రెండు బీరువాలను పగులగొట్టి వాటిలో ఉన్న 8.5 తులాల బంగారు నగలు, రూ.70 వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. 2వ పట్టణ సీఐ రెడ్డెప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

బంగారు నగల అపహరణ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి ఆర్టీసీ బస్టాండులో రద్దీగా ఉండే సమయంలో తన బ్యాగులోని బంగారు నగలు అపహరణకు గురైనట్లు కడప జిల్లా వేంపల్లికి చెందిన స్వాతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేంపల్లి మండలం పిరమిడ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె దసరా సెలవులకు కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటకకు వెళ్లారు. రెండు రోజుల కిందట తిరుగు ప్రయాణంలో కదిరి ఆర్టీసీ బస్టాండులో హ్యాండ్ బ్యాగులోని 70 గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి చెప్పారు.

ఇరువర్గాల ఘర్షణ.. 24 మందిపై కేసు నమోదు

పామిడి: పామిడి పరిధిలోని కొండాపురంలో ఆదివారం దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ అమ్మవారిని ఊరేగింపు చేస్తుండగా ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురంలోని హరిజనవీధిలో దుర్గమ్మను ఊరేగిస్తుండగా ఇంటి ముందు దిష్టి తీసి బూడిద గుమ్మడి కాయ కొట్టారన్న విషయంతో పాటు ఇంట్లో వెళ్లడానికి దారి ఇవ్వలేదంటూ మాట మాట పెరిగి ఘర్షణకు దిగారు. ఇరువర్గాలూ దాడులు చేసుకున్నాయి. ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుపై 24 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోవులు తరలిస్తున్న కంటైనర్ బోల్తా



సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తాపడిన కంటైనర్ వాహనం

ధర్మవరం, న్యూస్‌టుడే : అక్రమంగా అనంతపురం నుంచి బెంగళూరుకు ఆవులు, ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ వాహనం ఆదివారం ధర్మవరం మండలం సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. కంటైనర్ వాహనం టైరు పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి కిందపడింది. కంటైనర్ బోల్తా పడడంతో రెండు ఆవులు, రెండు ఎద్దులు మృతి చెందాయి. మరో 8 ఆవులు, ఎద్దులు గాయపడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే వాహన డ్రైవర్‌తో పాటు గోవులను తరలిస్తున్న వారు ఘటనా స్థలం నుంచే పరారయ్యారు. ధర్మవరం గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన ఆవులు, ఎద్దులకు ధర్మవరం మండల పశువైద్యాధికారి శేఖర్, పశువైద్య సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. అనంతరం వాటిని పోతులనాగేపల్లి గోశాలకు పోలీసులు తరలించారు. అక్రమంగా ఆవులు తరలింపుపై ధర్మవరం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకని విచారణ చేస్తున్నారు.

విషాదం మిగిల్చిన విహారయాత్ర

● ఒకరిమృతి.. మరొకరు గల్లంతు



అనీసుల్లాఖాన్

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ మండలం గొల్లపల్లి జలాశయంలో విహారయాత్రకు వెళ్లిన రెండు బృందాల్లో విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. హిందూపురం పరిధిలోని నింకంపల్లికి చెందిన అనీసుల్లాఖాన్(42) కుటుంబంతో కలిసి గొల్లపల్లి జలాశయానికి విహార యాత్రకు వచ్చారు. సాయంత్రం జలాశయంలో ఈతకు వెళ్లి అనుకోకుండా నీట మునిగారు. గుర్తించిన తోటివారు వెంటనే చీరల సహాయంతో అనీసుల్లాఖాన్‌ని బయటకు తీసి, కొన ఊపిరితో ఉన్న క్షతగాత్రున్ని పెనుకొండలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య షమీంఖాన్, ఓ కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ వివరించారు.

అమ్మవారిపల్లికి చెందిన యువకుడు..

మండలంలోని అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(19) అనే యువకుడు గొల్లపల్లి జలాశయంలో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. స్థానికుల వివరాల మేరకు అమ్మవారిపల్లికి చెందిన కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతులకు ఓ కుమారుడు, ఓ కుమార్తె సంతానం. కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి అనంతపురంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చి మిత్రులతో కలిసి ఆదివారం జలాశయంలో ఈతకు వెళ్లాడు. హంద్రీనీవా కాలువ నుంచి జలాశయంలోకి నీళ్లు వేగంగా వస్తున్న చోట ఈతకు దిగడంతో యువకుడు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ పెనుకొండ కేంద్రాధికారి మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం ఘటనా స్థలికి చేరుకుని 2గంటల పాటు జలాశయంలో గాలించారు. చీకటి పడడంతో యువకుడి జాడ కనిపించక అగ్నిమాపక సిబ్బంది వెనుదిరిగారు. సోమవారం ఉదయం గాలింపు చర్యలు కొనసాగిస్తామని అగ్నిమాపకశాఖ అధికారి వివరించారు.



గొల్లపల్లి జలాశయంలో గల్లంతయిన యువకుడి కోసం గాలిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

విద్యుదాఘాతంతో

గొర్రెల కాపరి దుర్మరణం

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. డి.హీరేహాళ్ గ్రామానికి చెందిన నాగరాజుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండో కుమారుడు ఎర్రిస్వామి (16) శనివారం ఉదయం గొర్రెలు మేపడానికి వెళ్లాడు. 11 గంటల సమయంలో నియంత్రిక సమీపానికి గొర్రెలు వెళ్తుండగా వాటిని అడ్డగించేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైనట్లు తెలిపారు. క్షతగాత్రుడిని బళ్లారికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తండ్రిపై కుమారుడి దాడి / చికిత్స పొందుతూ మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం చేస్తున్న ఓ ప్రైవేటు ఉద్యోగి క్షణికావేశంలో తండ్రిపై దాడి చేసి మృతికి కారణమయ్యాడు. ఫలితంగా ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు కటకటాలపాలయ్యాడు. నాల్గో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీదేవి, ఆవుల రవీంద్రారెడ్డి (54) కుటుంబం నగరంలోని జనశక్తినగర్‌లో నివాసముంటున్నారు. ఆయన వ్యాను డ్రైవరుగా పని చేసేవారు. వీరికి కుమారుడు వేణుగోపాలక్రిష్ణారెడ్డి, కుమార్తె శ్రావణి ఉన్నారు. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం ఇంటి నుంచి విధులు నిర్వహిస్తున్నారు. రవీంద్రారెడ్డి జూదం, మద్యానికి బానిసై పలువురి వద్ద అప్పులు చేశారు. ఈ విషయమై నిత్యం మద్యం తాగి, భార్య, కుమార్తెతో గొడవపడి ఇబ్బందులకు గురిచేసేవారు. బంధువులు పంచాయితీ చేసినా తీరులో మార్పు రాలేదు. శనివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి వెళ్లి భార్య, కుమార్తెతో గొడవపడి దాడి చేశారు. ఈ విషయాన్ని కుమార్తె పక్క గదిలో పని చేస్తున్న తన అన్న వేణుగోపాల్‌కు చెప్పింది. కోపోద్రిక్తుడైన అతడు రోకలి బండతో తండ్రి తల, భుజాలపై కొట్టాడు. బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. వెంటనే ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. భార్య ఫిర్యాదు మేరకు కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డులో నివాసముంటున్న రాబి (29) అనే వివాహిత ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. ఇరానీ కాలనీకి చెందిన రాబి దోనిముక్కలలో ఇంటిని బాడుగకు తీసుకుని కుమారుడు, కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తోంది. భర్త మహమ్మద్ ఇంటికి దూరంగా ఉండడంతో ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుందని గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

అప్పుల బాధతో మందుల దుకాణం నిర్వాహకుడు..



శ్రీనివాసులు

ధర్మవరం, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక ధర్మవరంలోని సిద్ధయ్యగుట్ట కాలనీకి చెందిన చీమల శ్రీనివాసులు (40) మందుల దుకాణ నిర్వాహకుడు శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. శ్రీనివాసులు మెడికల్ ఏజెన్సీ, మందుల దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా జరగకపోవడంతో పెట్టుబడికి చేసిన అప్పులు కట్టలేక కొంతకాలంగా మనస్తాపం చెందుతుండేవాడని స్థానికులు తెలిపారు. శనివారం దసరా పండగ రోజున శ్రీనివాసులు భార్య భువనేశ్వరి, ఇద్దరు కుమార్తెలు గుడికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసులు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని అతని మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు.

భర్తను చంపిన కేసులో భార్య అరెస్టు



హత్యకు వినియోగించిన రోకలి బండను చూపుతున్న సీఐ రెడ్డెప్ప

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం మండలం ధర్మపురి గ్రామంలో ఈ నెల 10న జరిగిన దేవరకొండ గోవిందు హత్య కేసులో అతని భార్య అంజినమ్మను శనివారం ధర్మవరం గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు వివరాలను గ్రామీణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇన్‌ఛార్జి సీఐ రెడ్డెప్ప, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రావులచెరువు క్రాస్‌లో ఆమెను అరెస్టు చేశామని, హత్యకు ఉపయోగించిన రోకలి బండను స్వాధీనం చేసుకున్నామని సీఐ రెడ్డెప్ప తెలిపారు. కొన్నేళ్లుగా ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో గోవిందునితో భార్య గొడవ పడుతుండేది. ప్రశ్నించిన ఆమెను అతను కొట్టడం అవమానపరచడం చేసేవాడని సీఐ వివరించారు. ఈ నెల 10న భార్యతో గొడవ పెట్టుకున్న భర్త, భార్య గొంతు పట్టుకుని ఘర్షణ పడ్డాడు. ఆమె రోకలి బండతో భర్త తలపై మోదడంతో మృతి చెందాడని తెలిపారు. అంజినమ్మను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని పోలీసులు పేర్కొన్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

కాలువలో ఇరుక్కున్న లారీ

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు తరలిస్తున్న బండల లారీ కోట ముఖ ద్వారం వద్ద మురుగు కాలువలో ఇరుక్కుంది. లారీలోని కొన్ని బండలను తొలగించి ఇటాచీతో పైకి తీశారు. కోట ముఖద్వారం వద్ద ఇరువైపులా కాలువల కల్వర్టులు అధ్వానంగా ఉన్నాయి. మరమ్మతు పనులు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్రికెట్ విజేత మరిమాకులపల్లి జట్టు

కంబదూరు, న్యూస్‌టుడే: మండలంలోని మరిమాకుపల్లి పంచాయతీ గుద్దెళ్లలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మరిమాకుపల్లి జట్టు విజేతగా నిలిచింది. గుద్దెళ్ల జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విన్నర్స్‌కు రూ.10 వేలు, రన్నర్స్‌కు రూ.5 వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. తెదేపా నాయకుడు చిందుచౌదరి నగదును అందజేశారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జి రెవెన్యూ డివిజనల్ అధికారి వినూత్న తెలిపారు. వర్షాల కారణంగా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే చరవాణి నంబరు 08497 - 220322 సమాచారం అందించాలన్నారు. 24 గంటలు సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య వస్తే వెంటనే సమాచారం అందజేయాలని తెలిపారు. వర్షాలు కురిసేటప్పుడు సురక్షిత ప్రాంతాల్లో ఉండి జాగ్రత్తలు పాటించాలని వివరించారు.

కామాంధులను కఠినంగా శిక్షించాలి

ఉరవకొండ, న్యూస్‌టుడే: మహిళలపై అత్యాచారానికి పాల్పడే కామాంధులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తెలిపారు. మండలంలోని కొనకొండ్లలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఒంటరి మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని అత్యాచారానికి పాల్పడుతున్నారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వివరించారు.

విద్యుత్తు నియంత్రిక ధ్వంసం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాలవాయి గ్రామ శివారులో అనిల్ అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్తు నియంత్రికను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. ఉదయాన్నే తోటలోకి వెళ్లిన రైతుకు నియంత్రిక కనిపించలేదు. నియంత్రికను ధ్వంసం చేసి రాగి, అయిల్‌ను ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం పదేకరాల్లో బ్యాడిగి మిరప, టమాటా పంటలు సాగు చేశారు. ఇప్పుడు నీరు ఎలా అందిచాలని ఆందోళన చెందుతున్నారు. నియంత్రికను అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

పల్లెలకు పండగొచ్చింది

నేటి నుంచి శంకుస్థాపనలు



గోనబావిలో అధ్వానంగా రోడ్డు

రాయదుర్గం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు అభివృద్ధి చెందనున్నాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయటానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనెల 14 నుంచి 21 వరకు 'పల్లె పండగ' పేరుతో ప్రభుత్వం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పలు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమాలు చేయనున్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డి.హీరేహాళ్ మండలంలోని సోమలాపురంలో సోమవారం భూమి పూజ చేయనున్నారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులను ఈ నిర్మాణాలకు వినియోగించనున్నారు. దీనికి అదనంగా 15వ ఆర్థిక సంఘం, గిరిజన గ్రామాల్లో గిరిజన ఉప ప్రణాళిక నిధులను కూడా వినియోగించనున్నారు.

మండలం	నిర్మించనున్న రోడ్లు (సంఖ్యల్లో)	మంజూరైన నిధులు (రూ. కోట్లలో)
కణేకల్లు	93	4.10
బొమ్మనహాళ్	83	3.51
గుమ్మఘట్ట	105	3.05
రాయదుర్గం	64	2.60
డి.హీరేహాళ్	71	2.79
	416	16.05

- మండలాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలను ప్రజా ప్రతినిధులు, పంచాయతీరాజ్ శాఖ డీఈ, ఎంపీడీవోల ఆధ్వర్యంలో గుర్తించనున్నారు. వాటిని నామినేషన్ పద్ధతిలో పూర్తి చేయనున్నారు.
- ఇతర శాఖల నుంచి వివిధ పనులకు మంజూరైన నిధులతో కొన్ని పనులకు భూమి పూజలు చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈనెల 21లోగా మంజూరైన అన్ని పనులకు శ్రీకారం చుట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
- నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 416 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.16.05 కోట్లను మంజూరు చేసింది.

గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో మురుగుకాలువల నిర్మాణాలను చేపట్టనున్నారు. రాయదుర్గం మండలం పల్లేపల్లి, బొమ్మనహాళ్ మండలంలో ఉద్దేహాళ్, గుమ్మఘట్ట మండలం కలుగోడు, డి.హీరేహాళ్ మండలంలో మురడి గ్రామాల్లో రూ.12 లక్షలతో నిర్మించనున్నారు. కణేకల్లు మండలంలో రూ.16 లక్షలతో నిర్మించనున్నారు. వాటికి సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది.

పనుల ప్రారంభానికి ఏర్పాట్లు

గ్రామాల్లో ఆయా పనుల శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేస్తున్నాం. తొలి దశలో 416 పనులకు రూ.16.05 కోట్లతో శ్రీకారం చుట్టనున్నాం. నాణ్యతలో రాజీ పడకుండా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటాం. **- సుధాకర్ నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహం వెనుక చెత్తచెదారం పేరుకుపోయింది. **- నాగరాజు**

సమాధానం: వెంటనే తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: పట్టణంలోని 13వ వార్డులో పైపులైన్ల లీకేజీతో తాగునీరు వృథా అవుతోంది. **- నాగరాజనాయక్**

సమాధానం: లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. **- దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్**

సమస్య: కంబదూరులో చిన్నపాటి వర్షానికే మురుగు రహదిరిపై ఏరులై పారుతోంది. **- స్థానికులు**

సమాధానం: మురుగు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: కంబదూరు మండలంలోని కొత్తపల్లిలో అపరిశుభ్రత నెలకొంది. **- గ్రామస్థులు**

సమాధానం: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, రాయదుర్గం, కంబదూరు

వివాహిత ఆత్మహత్య

కంబదూరు, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని చెర్లోపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని చెర్లోపల్లికి చెందిన వడ్డె నాగేంద్ర భార్య హేమలత (26) ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. మృతురాలి భర్త, కుమార్తె మూర్ఛ వ్యాధితో గత కొన్నాళ్లుగా బాధపడుతున్నారు. ఈ క్రమంలో కుటుంబ పెద్ద ఇలా అనారోగ్యంతో బాధపడుతున్నారని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరివేసుకొని కూలీ..

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరుకు చెందిన బోయ నగేశ్ (30) ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌హెచ్‌వో సుధాకర్ తెలిపిన మేరకు వివరాలిలా.. మృతుడి భార్య గత నాలుగు నెలల కిందట మృతి చెందిందని, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కర్ణాటకలోని హీరేహళ్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని వడ్రవన్నూరుకు చెందిన చంద్రన్న (48) అనే ఉద్యోగి దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. బళ్లారి తాలూకా తకళి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం విధులు ముగించుకుని భార్య స్వగ్రామం మొగలహళ్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తకళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో దసరా వేడుకలు



రాయదుర్గం: శాంతికాలో మహాకాళి అమ్మవారు



విడపనకల్లులో..



కళ్యాణదుర్గం: ఉయ్యాలోత్సవంలో వాసవీమాత



కళ్యాణదుర్గం గ్రామీణం: రాకెట్లలో అక్కమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు



ఉరవకొండ: శమీ వృక్షాన్ని దర్శించుకుంటున్న భక్తులు



వజ్రకరూరు: గంజికుంటలో దుర్గామాత ఊరేగింపు



కళ్యాణదుర్గం గ్రామీణం: బోరంపల్లిలో జమ్మి వృక్షం వద్దకు ఎడ్లబండ్లపై వెళ్తున్న పాండవుల వేషధారులు

విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో శనివారం దేవత ఉత్సవ విగ్రహాలను మంగళవాద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లను భక్తులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. భక్తులతో ఆలయాలు సందడిగా కనిపించాయి. శమీ వృక్షాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు దసరా ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**



రాయదుర్గం: చిన్నారుల కోలాటం



రాయదుర్గం: శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రాయదుర్గం: 7వ వార్డులో అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



ఉరవకొండ: దుర్గా భవానీ ఆలయంలో భక్తులు



బ్రహ్మసముద్రం: శమీ వృక్షానికి ఊరేగింపుగా వెళ్తున్న చన్నమల్లప్పస్వామి మఠాధిపతి

చంద్రబాబు సహకారంతో వంతెన సాకారం

కణేకల్లు: రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ ప్రజా రవాణా దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధుల మంజూరుకు ఆమోదం తెలపడంతో వేగంగా కణేకల్లు హగరి వంతెన నిర్మాణ శంకుస్థాపనకు సాకారమైందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం దసరా పర్వదినం సందర్భంగా మాల్యం వైపు కళేకుర్తి వద్ద ఎన్‌డీబీ నిధులు రూ.48 కోట్లతో చేపట్టే కణేకల్లు హగరి వంతెనకు ర.భ ఎస్ఈ ఓబుళరెడ్డి, ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈ రవిశంకరరెడ్డి, గుత్తేదారులు శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డిలతో భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కళేకుర్తి సుదర్శన ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కోసి తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్నారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకొన్న పాపాన పోలేదని విమర్శించారు. ఎంపీపీ లీలావతి, జడ్పీటీసీ పద్మావతి, తెదేపా మండలాల కన్వీనర్లు లాలెప్ప, హనుమంతరెడ్డి, నాయకులు ఆనందరాజు, మరియప్ప తదితరులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఘనంగా కాలవ జన్మదిన వేడుకలు

రాయదుర్గం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జన్మదినోత్సవాన్ని శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహం, తెదేపా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలం దర్గా హొన్నూరుకు చెందిన కేశప్ప తెచ్చిన 60 కిలోల కేక్‌ను ఎమ్మెల్యే కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళు పురుషోత్తం, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్లు కడ్డిపుడి మహబూబ్ బాషా, గాజుల వెంకటేశులు తదితరులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.


- ఆర్ఎంపీలపై కక్ష సాధింపులు, అధికారుల వేధింపులు ఉండవని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని హాటకేశ్వర కల్యాణ మండపంలో ఆర్ఎంపీల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాథమిక వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆర్ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి సుధాకర్, జిల్లాధ్యక్షుడు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని భంభంబాబా స్వామి ఆశ్రమానికి వెళ్లే రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఇళ్లకు అంజనాద్రి నగర్‌గా ఎమ్మెల్యే నామకరణం చేశారు.

మూతపడిన తనిఖీ కేంద్రం



విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే: ఉరవకొండ నుంచి విడపనకల్లు మండలం పాల్తూరు మీదుగా కర్ణాటకలోని బళ్లారికి ప్రధాన రహదారి ఉంది. ఈ దారిలో మద్యం, ఇసుక, బియ్యం లాంటి ఇతరత్రా అంశాల్లో అక్రమ రవాణాను నియంత్రించేందుకు గత ఎన్నికల సమయం వరకు హావళిగి వద్ద తనిఖీ కేంద్రాన్ని పోలీసులు నిర్వహించారు. అయితే ఎన్నికల తరువాత ఆ కేంద్రం మూతపడింది. ఇది అక్రమార్కులకు కలిసి వస్తోంది. ఈ రహదారి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి కర్ణాటకలోకి ప్రవేశించడానికి దగ్గర దారి. దీంతో మద్యం, ఇసుక, బియ్యం తరలించడానికి అక్రమార్కులు ఈ దారిని ఎంచుకుంటుంటారు. అక్కడ నిఘా లేక పోవడంతో ఈ మధ్య కాలంలో వాటి రవాణా అధికమైనట్లు వాదన ఉంది. ఆ కేంద్రాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకు రాకపోతే అక్రమ రవాణా పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిని ఎక్సైజ్ సీఐ రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లగా.. గతంలో సెబ్ అధికారులు ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి నిర్వహించారని, ఎన్నికల తరువాత మూత పడిందన్నారు.

చెరువులో రైతు మృతదేహం లభ్యం



కిశోర్‌కుమార్

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుంట శివారు హెచ్చెల్సీ 6వ డిస్ట్రిబ్యూటరీ గట్టు వద్ద గత గురువారం అదృశ్యమైన వ్యక్తి కణేకల్లు చెరువులో శవమై తేలినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన రైతు కిశోర్‌కుమార్ (43) ఆదివారం కణేకల్లు చెరువులో శవమై తేలాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకున్న పోలీసులు గత నాలుగు రోజులుగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. చెరువులో శవాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, శవపరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తెదేపా, వైకాపా వర్గీయుల ఘర్షణ

16 మందిపై కేసు నమోదు



బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

శెట్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని కైరేవులో శనివారం తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్ఐ రామ్‌భూపాల్ తెలిపిన వివరాల మేరకు.. దసరా పండగ సందర్భంగా గ్రామంలోని పీర్ల చావిడి వద్ద వైకాపా మద్దతుదారు ఒకరు ట్రాక్టరు తిప్పుతూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుండగా, అలా చేయవద్దని వారించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామపెద్దలు నచ్చజెప్పడంతో సద్దుమణిగింది. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో వైకాపా వర్గీయుడు కొంతమందితో బొలెరో వాహనంలో వెళ్లి తెదేపాకు చెందిన ఈశ్వరప్ప ఇంటిపై దాడి చేశాడు. ఈశ్వరప్ప, తన కుమారుడు గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 16 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కళ్యాణదుర్గం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరప్పను తెదేపా నాయకులు పరామర్శించారు. ఈ కేసులో తన కుమారుడి పేరు పెట్టారని వైకాపా మద్దతుదారు పాతలింగప్ప మనస్తాపానికి గురై ఆదివారం విషపు ద్రావకం తాగినట్లు తెలిపారు. వెంటనే చికిత్స కోసం కళ్యాణదుర్గం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

కొనకొండ్లలో ఇరువర్గాలపై..

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొనకొండ్లలో ఆదివారం ఉట్ల తేరు పరిసర ప్రాంతంలో ఘర్షణకు దిగిన ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వినాయక నిమజ్జనంలో జరిగిన తోపులాటను మనసులో ఉంచుకుని కేశవయ్య, సుదర్శన్‌లు ఆదివారం మరోసారి వాగ్వాదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

జూదరుల అరెస్టు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని ఉంతకల్లు సమీపంలో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,850 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాయదుర్గం కోర్టులో హాజరు పరిచారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కార్మికులకు దుస్తుల వితరణ

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్, భవన నిర్మాణ కార్మికులు, పేదలకు భాజపా జిల్లా కార్యదర్శి వెంకటస్వామి నాయుడు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. తన తండ్రి సీతప్ప నాయుడును ఆదర్శంగా తీసుకుని దానం చేస్తున్నట్లు తెలిపారు.

రహదారిపై కదలని మురుగు



ఉరవకొండ ఆర్డీటీ కార్యాలయం ఎదురుగా గుంతకల్లు ప్రధాన రహదారిలోని నివాస గృహాల ముందు మురుగు పేరుకుపోయింది. చిన్నపిల్లలు ఆడుకుంటూ నీటిలో దిగుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారిపై నెలకొన్న అపరిశుభ్రతను సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ.. రాకపోకలు సాగించేందుకు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్‌ను వివరణ కోరగా.. వెంటనే శుభ్రత చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

దారి ఇలా.. నడక ఎలా

రాయదుర్గం పట్టణంలోని నేసేపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఎదురుగా ఉన్న వీధి నుంచి చౌడమ్మ గుడికి వెళ్లే దారిలో బురద పేరుకుపోయింది. ప్రధాన కాలువ ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా బురద మొత్తం దారిపైకి చేరుతోంది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది మురుగును తొలగిస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రను వివరణ కోరగా మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం**



సూచిక బోర్డు ఏర్పాటు చేయరూ!



మండలంలోని కుందుర్పి నుంచి బొమ్మాజిపల్లి వరకూ గతంలో వేసిన రహదారికి, తమ్మయ్యదొడ్డి గ్రామానికి వెళ్లే మలుపు వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు విరిగిపోయింది. కొందరు ఆకతాయిలు సూచిక బోర్డును సమీపంలోని పొలంలో వేశారు. దీంతో వాహన చోదకులు మలుపు వద్దకు వచ్చేంత వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

మొక్కజొన్న ధరల పతనం



మొక్కజొన్నలు ఆరబెట్టుకొంటున్న రైతులు

కణేకల్లు, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి సాగుచేసిన మొక్కజొన్న ధరల పతనంతో అన్నదాతలు కుదేలవుతున్నారు. గిట్టుబాటు ధరకు కత్తెర వేసేలా...దళారులు ఇష్టారాజ్యంగా ధరలు తగ్గించి వేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో వ్యవసాయ బోర్ల కింద రైతులు విస్తారంగా మొక్కజొన్న సాగు చేశారు. కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లో 5,677 హెక్టార్లలో సాగు చేసినట్లు అధికారులు నివేదిస్తున్నారు.

- దుక్కి మొదలుకొని పంట కోత, నూర్పిడి వరకు ఎకరాకు రూ.35వేలకు పైగా పెట్టుబడి వ్యయం చేస్తున్నారు. పెరిగిన ట్రాక్టరు అద్దె, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు, కూలీల వ్యయంతో పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. సాగు సమయంలో ఆశాజనకంగా పలికిన ధరలు పంట చేతికందే సరికి పతనం అవుతుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.
- పెరిగిన ధరల కారణంగా మొక్కజొన్న పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగింది. రూ.400 నుంచి రూ.500 చెల్లిస్తే తప్పా కూలీలు దొరకని దుస్థితి. ఎకరా పొలం మూడు సార్లు దుక్కి చేయడానికి రూ.2,500, బోదలు తోలడం, అంతర సేద్యం రూ.2 వేలు, విత్తనాలకు రూ.5 వేలు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు రూ.14 వేలు, పంట కోత నూర్పిడి గట్టుకు చేరుకోవడానికి ఎకరాకు రూ. 9 వేలు, విత్తు, ఎరువులు చల్లడం, మందుల పిచికారి తదితర కూలీల ఖర్చు రూ.5 వేలు, ఇలా ఎకరాకు రూ.35వేలకు పైగా వ్యయం చేయాల్సిన వస్తోంది.

ద్విచక్ర వాహనం, కారు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలంలోని గూళ్యపాళ్యం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. వజ్రకరూరుకు చెందిన వేములనాయుడు, ఇద్దరు కుమారులతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా, అదే దారిలో వస్తున్న కారు ఢీకొనడంతో వేములనాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంతకల్లు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. సమాచారం వచ్చిందని, ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు తెలిపారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా పండగను పురస్కరించుకొని శనివారం ఉత్సవమూర్తులకు చక్రస్నానం, ధ్వజారోహణం నిర్వహించారు. ఆదివారం శ్రీవారి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. స్వామికి విశేష పూజలు చేశారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి బోనాల సమర్పణ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : బుక్కరాయసముద్రంలో వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల ఉత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు తెల్లవారుజామునే పెద్దమ్మతల్లిని వెండి, బంగారు ఆభరణాలతో పాటు, పూలతో అలంకరణ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరుణాకర్, తెదేపా నాయకులు రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు, అశోక్, నారాయణస్వామి పూజల్లో పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న భక్తులు

నేటి నుంచి పల్లెపండగ

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 14 నుంచి ప్రభుత్వం నిర్వహించే పల్లెపండగ కార్యక్రమ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బారెన్‌సాహెబ్ తెలిపారు. 14న తిమ్మాపురం, అప్పేచెర్ల, భీమునిపల్లి, రావులుడికి, 15న మేడిమాకులపల్లి, చింతలచెరువు, చిత్రచేడు, చిట్టూరు, 16న కొట్టాలపల్లి, దిమ్మగుడి, వీరన్నపల్లి, 17న వెంకటాంపల్లి, కండ్లగూడూరు, విరుపాపురం, మల్లేనిపల్లి, 18న ముప్పాలగుత్తి, మిడుతూరు, గుత్తిఅనంతపురం, కాశేపల్లి, 19న చిన్నవడుగూరు, రాంపురం, పెద్దవడుగూరు, బుర్నాకుంట, 20న క్రిష్టిపాడు గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఇదివరకు గ్రామసభల ద్వారా ఆమోదించిన పనులకు సంబంధించి భూమిపూజ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

రూరల్ సీఐగా ప్రవీణ్ కుమార్

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : గుంతకల్లు రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఎన్.ప్రవీణ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉరవకొండ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు సీఐ మహేశ్వర్ రెడ్డిని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. బాధ్యతలు చేపట్టిన సీఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



తేనెటీగల దాడిలో గాయాలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని ఎంపీఆర్‌డ్యాం గ్రామంలో శనివారం తేనెటీగల దాడిలో ఐదుగురు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. తేజ, లక్ష్మి, ఆదిలక్ష్మి, విష్ణువర్ధన్, వేణుమారుతి గాయపడగా వారిని చికిత్స కోసం 108వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

మతిస్థిమితం లేక ఆత్మహత్య

గుంతకల్లు, న్యూస్‌టుడే : భార్యా బిడ్డలు దూరం కావడంతో ఆ బాధను భరించలేక మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుంతకల్లు రైల్వే ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. ఈ ఘటన ఆదివారం ఉదయం గుంతకల్లు - కల్లూరు రైలు మార్గంలో కొనకొండ్ల రైల్వే గేటు సమీపంలో జరిగింది. గుంతకల్లులోని రామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న గొర్రెల కాపరి రంగస్వామి (55) రైలు కింద పడి చనిపోయినట్లు ఎస్‌ఐ వివరించారు. ఇరవై సంవత్సరాల కిందట అతని భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి గుంతకల్లులోనే గొర్రెల కాపరిగా మారి జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో రైలు కింద ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

గుత్తి, న్యూస్‌టుడే : తన భార్య కాపురానికి నిరాకరించిందన్న ఆవేదనతో గుత్తిలోని వీరారెడ్డి కాలనీకి చెందిన బాలరంగడు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాలనీలో నివాసం ఉంటూ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన భార్యతో మనస్పర్థలు వచ్చాయి. ఈక్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆయన శుక్రవారం పురుగు మందు తాగాడు. ఇది గమనించిన కాలనీ వాసులు వెంటనే ఆయన్ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో యువకుడు..

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన రమేశ్ అనే వ్యక్తి ఆదివారం విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జరిగింది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రమేశ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

వీధుల్లో చెత్తకుప్పలు

● కంపుతో ఇబ్బంది పడుతున్న జనం

గుంతకల్లు, న్యూస్‌టుడే : రహదారులను నిర్మించకపోవడంతో కాలనీలోని మట్టిరోడ్లు గుంతలు పడుతున్నాయి. అంతేకాకుండా ఇక్కడ పోగవుతున్న చెత్తను తొలగించకపోతుండడంతో కాలనీలు చెత్తతో నిండుకుంటున్నాయి. ఇది దోనిముక్కల ఇందిరమ్మ కాలనీల దుస్థితి. కాలనీ పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉంది. ఇళ్లు మంజూరు సమయంలో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోలేమని చెప్పడంతో ప్రభుత్వం దాదాపు 1200 ఇళ్లను ఆర్డీటీ ద్వారా నిర్మించింది.

ఇదీ పరిస్థితి

గుంతకల్లు - పామిడి రోడ్డుకు ఇరువైపులా రెండు ఇందిరమ్మ కాలనీలు ఉన్నాయి. రోడ్డుకు ఎడమవైపున కొన్ని ఇళ్లను ఆర్డీటీ సంస్థ నిర్మించగా మరికొన్ని ఇళ్లను లబ్ధిదారులే స్వయంగా నిర్మించుకున్నారు. ఇక్కడ 1000 దాకా ఇళ్లున్నాయి. రెండు కాలనీల్లో 18 దాకా రోడ్లుంటే ఇందులో మున్సిపల్ అధికారులు నాలుగు సిమెంటు రోడ్లను నిర్మించారు. మిగిలిన రోడ్లన్నీ మట్టిరోడ్లే, వర్షం వస్తే మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఇక్కడ మురుగు కాలువలను నిర్మించక పోవడంతో నీరంతా రోడ్లపైకి వస్తోంది. ఇక కాలనీల్లో వీధులు శుభ్రం చేయడానికి అధికారులు పారిశుద్ధ్య కార్మికులను నియమించలేదు. ఫలితంగా స్థానికులు ఇళ్లలోని చెత్తను తీసుకొచ్చి రోడ్ల పక్కన పడేస్తుంటే వీధులు, పరిసరాలు చెత్తకుప్పలుగా మారుతున్నాయి. వీటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక జనం ఇబ్బంది పడుతున్నారు.



మురుగునీటితో నిండుకున్న కాలనీల్లోని ఓ రోడ్డు



ఇళ్ల వద్ద పేరుకుపోతున్న చెత్తకుప్పలు

సమస్య పరిష్కారానికి కృషి - హరికృష్ణ, మున్సిపల్ ఏఈ

దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలతో పాటు పట్టణ శివారులోని కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువను నిర్మించడానికి అవసరమైన సర్వే చేస్తున్నాం. సర్వే పనులు ప్రైవేట్ వారికి అప్పగిస్తున్నాం. వారు డీపీఆర్ తయారు చేసిన తరువాత నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నాం. నిధులు విడుదల అయిన వెంటనే పనులు చేపడతాం. ప్రజారోగ్య విభాగం వారు చెత్తను తొలగించాల్సి ఉంది. ఈవిషయాన్ని వారి దృష్టికి తీసుకెళతాం.

శింగనమల, న్యూస్‌టుడే

సమస్య : జూలకాల్వ గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త నిల్వ ఉంటోంది. **- భాస్కర్, జూలకాల్వ**

సమస్య : శింగనమల ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల వద్ద అపరిశుభ్రత నెలకొంది. పిచ్చి మొక్కలతో కార్యాలయాలు నిండి పోయాయి. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. **- షాహీద్, శింగనమల**

సమాధానం : రెండు సమస్యలను పరిష్కరిస్తాం. **- నిర్మలకుమారి, ఎమ్పీడీవో**

'పంచాయతీల ప్రగతికి పాటుపడతా'

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మద్యం దుకాణ టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ఇరవైశాతం పంచాయతీల అభివృద్ధికి వచ్చేలా కృషి చేస్తానని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జే.సీ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దవడుగూరుకు వచ్చిన సందర్భంగా ఆయన తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో వైకాపా పనితీరుపై విరుచుకుపడ్డారు. వైకాపా నాయకుల అరాచకాలను ఎండగట్టారు. ఐదేళ్ల కాలంలో వారు చేసిన అరాచకాలను బయటపెడుతానని హెచ్చరించారు.

పల్లె రహదారులకు మహర్దశ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామీణ రహదారులకు తెదేపా ప్రభుత్వంలో మోక్షం లభించనుంది. గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించడంలో విఫలమవ్వడంతో కొందరు సొంత ఖర్చులతో రహదారులు బాగు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేయడంతో పనులు మొదలు పెట్టడానికి పంచాయతీ రాజ్ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. మండల వ్యాప్తంగా 18 గ్రామాల్లో రూ.1.69 కోట్లతో 46 రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో మురుగు సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు పనులు గుర్తించాం, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మండల ఇంజినీర్ ఓబులేసు తెలిపారు.



వైటీ చెరువు గ్రామంలో రోడ్డు దుస్థితి

రైల్వే దారులు గుంతలమయం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గతంలో రైల్వే కాలనీలు, కార్యాలయాలకు చెందిన రోడ్లు చూడముచ్చటగా ఉన్నాయి. ఇప్పుడు ఆ మార్గాలు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు ఉన్నతాధికారులు నిధులను కేటాయించక పోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రధానంగా డీజిల్‌షెడ్డు కార్మికులు, రైల్వే డివిజనల్ ఆసుపత్రికి వెళ్లే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా రైల్వే జంక్షన్‌కు వెళ్లే రోడ్డుతో పాటు ప్రభాత్‌నగర్, వీవీనగర్, మోదీనాబాదు రైల్వే కాలనీల్లోని రోడ్లు కూడా పాడైపోయాయి. ఇక రైల్వే జంక్షన్ కూడలిలోని రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రైల్వే ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



అధ్వానంగా డీజిల్‌షెడ్డు, రైల్వే ఆసుపత్రికి వెళ్లే దారి



హెచ్చెల్సీ కాలవ దగ్గర గుమిగూడిన రైతులు

హెచ్చెల్సీ నీటి కోసం రైతుల వాగ్వాదం

నార్పల, న్యూస్‌టుడే : సాగు నీటి కోసం కూరగానిపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాల రైతులు పరస్పరం వాగ్వాదానికి దిగారు. ఇటీవల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చొరవతో హెచ్చెల్సీ కాలవకు ఇటీవల అధికారులు నీరు వదిలారు. శనివారం రాత్రి 28వ ఆయకట్టు కాలువ దగ్గర కూరగానిపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాల రైతులు సాగునీటి విషయంలో వాగ్వాదానికి దిగారు. కాలువ దగ్గరే భైఠాయించి వాదనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ కౌలుట్లయ్య ఆదేశాల మేరకు నార్పల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నీరు వంతుల వారీగా వాడుకోవాలని సూచించి అక్కడి నుంచి రైతులను ఇళ్లకు పంపేశారు. సాగు నీటి పంపకాల విషయంలో మూడు గ్రామాల రైతుల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉన్నందున నీటిపారుదలశాఖ అధికారులు వివాదాన్ని పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



ముళ్ల పొదలతో లోలూరు రహదారి

ఆదమరిస్తే.. అంతే

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండల లోలూరు రోడ్డు ముళ్ల పొదలతో నిండి పోయింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. ఆకులేడు నుంచి లోలూరు క్రాస్ వరకు ముళ్ల పొదలు వాహన చోదకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నడి రోడ్డు పైకి ముళ్ల పొదలు వచ్చినా పట్టించుకొనే వారు లేరని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు ముళ్ల పొదలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను మండల పంచాయతీ అధికారి కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

దసరా వేళ.. ఆధ్యాత్మిక కళ



గార్లదిన్నెలో అలంకరణలో వేంకటేశ్వరస్వామి



బుక్కరాయసముద్రం : ప్రత్యేక అలంకరణలో ముసలమ్మతల్లి



పల్లకీసేవ వడియంపేట చౌడేశ్వరీదేవి



కేశవాపురంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి



బుక్కరాయసముద్రం పెద్దమ్మతల్లి

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాలన్నీ విద్యుత్తుకాంతులతో, భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం ఉత్సవమూర్తులను పల్లకీలో నగరోత్సవం నిర్వహించారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. **-న్యూస్‌టుడే బృందం**



పామిడిలో కన్యాకపరమేశ్వరీ అమ్మవారు



గుత్తిలో వాసవీమాత



పెద్దపప్పూరులో జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



యాడికి : మహిళల కోలాట ప్రదర్శన

తెదేపా శ్రేణుల సందడి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : శింగనమల నియోజకవర్గ తెదేపా ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇల్లూరు, కేశవాపురం, కోటంక, ముకుందాపురం, కనంపల్లి, కల్లూరు, గార్లదిన్నె తదతర గ్రామాల్లో కేకులు కోసి సంబరాలు చేశారు. అనంతపురంలోని ఆయన నివాసం వద్ద నాయకులు, కార్యకర్తల సందడి కనిపించింది. పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో జన్మదిన శుభాకాంక్షలు నాయకులు, కార్యకర్తలు తెలిపారు.



ముంటిమడుగు కేశవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నాయకులు

పాతకల్లూరులో ముగ్గుల పోటీలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : పాతకల్లూరు గ్రామంలో విజయదశమి పండగ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ఆదిలక్ష్మికి మొదటి బహుమతి రూ.4 వేలు, సుమకు రెండో బహుమతి కింద రూ.3వేలు, వందనకు మూడో బహుమతిగా రూ.2 వేలను విజేతలకు నిర్వాహకులు అందజేశారు.

చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : పెద్దపప్పూరులో చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జ్యోతుల మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవర గృహంలో భక్తిశ్రద్ధలతో జ్యోతులను తయారు చేశారు. చౌడేశ్వరీదేవి ఆలయం వరకు గ్రామ పుర వీధుల గుండా జ్యోతులకు గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి భక్తిగీతాలను ఆలపిస్తూ డప్పువాయిద్యాలకు అనుగుణంగా నిర్వాహకులు నృత్యాలు చేశారు.

ఘర్షణలో ముగ్గురిపై కేసు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని ఎగువపల్లిలో ఆదివారం జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌస్ బాషా తెలిపారు. గ్రామంలో రోడ్డు విషయంలో రెండు వర్గాలు ఘర్షణపడగా రామమోహన్, నాగలక్ష్మీ, ఆదినారాయణ గాయపడ్డారు. వీరిపై దాడి చేసిన ఉదయ్‌కుమార్,దేవంద్ర, రామయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాడిపత్రి క్రికెట్ జట్టు ఘన విజయం

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన అనంత ప్రీమియర్ లీగ్‌లో తాడిపత్రి జట్టు ఘన విజయం సాధించింది. మొదట టాస్ గెలిసి బ్యాటింగ్ ఎంచుకున్న ఆత్మకూరు జట్టు 26.1 ఓవర్లలో 121 పరుగులు సాధించి ఆల్ అవుటయ్యారు. తరువాత బ్యాటింగ్‌కు దిగిన తాడిపత్రి జట్టు 37 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 122 పరులు సాధించింది. ఇందులో ఆదిత్య 5 వికెట్లు తీసి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ కైవసం చేసుకున్నారు. విజయం సాధించిన జట్టును ఆర్డీటీ సీనియర్ కోచ్ సాధిక్ వలీ అభినందించారు.

తాగునీటి కష్టాలకు దర్పణం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలో నెలకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. పామిడిలోని పెన్నా నుంచి నీరు వైటీచెరువు, సత్యసాయి పథకాల ద్వారా గుత్తికి తాగునీరు రావాల్సి ఉంది. ఈరెండు పథకాల నుంచి తగినంత నీరు రావడం లేదు.

ఇదీ పరస్థితి

గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి, సూరశింగనపల్లిలలో 55 వేలు జనాభా ఉంది. 13,500 నివాసగృహాలు ఉన్నాయి. పురపాలికలో 25 వార్డులున్నాయి. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజలు నీటికోసం పడరాని పాట్లు పడుతున్నారు. డ్రమ్ముల్లో నీటిని నిల్వచేసుకుంటూ తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. వార్డుల్లోని ప్రజలకు నెలకోసారి తాగునీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లు, కుళాయిల ద్వారా సరఫరా అయ్యేనీటిని నిల్వ ఉంచుకునేందుకు పట్టణ ప్రజలు ప్రతి ఇంటికీ డ్రమ్ములను ఏర్పాటు చేసుకుంటున్నారు. డ్రమ్ము కొనుగోలుకు రూ.1,200 వెచ్చిస్తున్నారు. పట్టణమంతా సుమారు రెండువేల డ్రమ్ములను ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు.



గుత్తిలోని తాడిపత్రి రోడ్డులో ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు

ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పట్టదా?

పామిడి, న్యూస్‌టుడే : పామిడి మున్సిపాలిటీగా పాలన సాగిస్తున్న సమయంలో పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కొత్తబస్టాండ్ సమీపంలో రూ.64 లక్షలతో యూపీహెచ్‌సీ(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్) ఆరోగ్య కేంద్ర నిర్మాణాన్ని చేపట్టింది. ఇప్పటి వరకు స్తంభాల వరకు చేపట్టిన నిర్మాణానికి రూ.24లక్షలు ఖర్చు చేశారు. నిధుల మంజూరు జాప్యంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. బెడ్డింగ్ స్థాయి వరకే నిర్మాణం పూర్తవ్వడంతో ప్రస్తుతం వర్షపు నీరు, మురుగు చేరి కుంటను తలపిస్తోంది. పందుల సంచారంతో దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. దోమల వ్యాప్తితో కాలనీవాసులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. నిర్మాణ పనులు అర్ధాంతరాంగా నిలిచిపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి భవం పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పిల్లర్ గుంతల్లో చేరిన మురుగు

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

15న ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఈనెల 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలదాకా అనంత నగరం హెచ్చెల్సీ కాలనీలోని తహసీల్దారు కార్యాలయం వెనుక భాగంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఎన్జీవో సంఘం సారథ్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ గుండె, కంటి వైద్యులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవచ్చన్నారు. జీఆర్‌బీఎస్, రక్తపోటు, ఈసీజీ, 2డీ ఎకో వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృద్ధులకు దుస్తుల వితరణ

లెక్చరర్స్ కాలనీ(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: శిల్పారామం సమీపంలో ఉన్న రాకేష్ వృద్ధాశ్రమంలో రోటరీక్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆశ్రమంలో ఉన్న మహిళలకు, పురుషులకు అందరికీ నూతన వస్త్రాలు వితరణ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విశ్రాంత ప్రిన్సిపల్, రోటరీక్లబ్ సీనియర్ సభ్యుడు ఆనందరావు జన్మదినాన్ని పురస్కరించుకుని చీరలు, పంచెలు, టవళ్లు అందజేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు భవానీ రవికుమార్, కార్యదర్శి గల్లా హర్ష, సీనియర్ సభ్యులు రామకుమార్‌రెడ్డి, శంకర్‌రాజ్, బీఎస్ఎన్ఎల్ ఇంజినీర్ రాహుల్‌తేజ, న్యాయ కళాశాల అధ్యాపకురాలు చైతన్య, విశ్రాంత ప్రభుత్వ అధ్యాపకురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కోసి వృద్ధులకు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003



సమస్య: నగరంలోని వెంకటేశ్వరనగర్‌లో డోరు నంబరు 28/1/981 వద్ద రెండు నెలలుగా మురుగు కాలువ శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. - బాబు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.

సమస్య: నగరంలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది. - ప్రసాద్

సమాధానం: తగు చర్యలు చేపడతాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు.) - న్యూస్‌టుడే, అనంత నగరపాలక

లైట్లు వెలిగించారు

రాంనగర్ (అనంత నగరపాలక), : రాంనగర్‌లోని సిద్ధార్థ ఉద్యానవనంలో లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టారు. బుధవారం ఈనాడులో ఒక్క లైటూ వెలగలేదు! శీర్షికన ఈనాడులో ఫొటో కథనం ప్రచురించిన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన నగరపాలక ఉద్యాన అధికారిణి లక్ష్మీప్రసన్న స్పందించారు. ఉద్యానవనాన్ని పరిశీలించి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టారు.

పిచ్చిమొక్కలు తొలగించారు

రుద్రంపేట, న్యూస్‌టుడే: రాంనగర్ పార్కు సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక ఫ్యూజు బోర్డు, తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో పిచ్చి మొక్కలు తొలగించరూ అన్న కథనం ఈనాడులో ప్రచురితమయింది. విద్యుత్తు ఉద్యోగులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించారు.

కూరగాయాలు



అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. ప్రజలు వీటిని కొనుగోలు చేయడానికి విపణికి వెళ్తే రూ.500లు ఖర్చు చేసినా సగం సంచి కూడా నిండని పరిస్థితి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు రోజు వారీ కావాల్సిన కూరగాయలను కొని పూట గడుపుతున్నారు. వేతన జీవులు వారానికి తగినంత కూరగాయలను కొనడానికి భయపడే పరిస్థితి. హోటళ్లు, రెస్టారెంట్లు, భోజన హోటళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు గతంలో ధరలు అందుబాటులో ఉన్నపుడు వారానికి తగినన్ని కూరగాయలు కొని నిల్వచేసుకునే వారు. ప్రస్తుతం పెరిగిన ధరలు చూసి రోజుకు ఎంత అవసరమో అంతే కొనుగోలు చేస్తూ సర్దుకుపోతున్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు కూరగాయల తోటలపై తీవ్ర ప్రభావం చూపింది. సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు దిగుబడి తగ్గింది. టమాటా, బీన్స్ తదితర వాటిని పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి. రవాణా ఛార్జీలు, ఇతర ఖర్చులు పెరిగి ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు గర్భిణులకు అందించే పోషకాహారం మీద ప్రభావం చూపింది. పెరిగిన ధరల వల్ల నిర్వాహకులు గిట్టుబాటు కాక ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందించలేని పరిస్థితి. అరకొరగా ఏవో కొన్ని రకాల కూరగాయలను కొని వండి వారుస్తున్నారు.

బీన్స్ కిలో రూ.100

పాతూరు, కొత్తూరు కూరగాయల మార్కెట్లలో కిలో బీన్స్ రూ.100లు, టమాటా రూ.60, ఉల్లిపాయలు రూ.60, బంగాళదుంపలు రూ.60 ధర పలుకుతోంది. క్యారెట్ ,కాకరకాయలు, బీరకాయలు, చిక్కుడు, క్యాలీఫ్లవర్, వంకాయల ధర కిలో రూ.40లు. కూరగాయలు సాగు చేస్తున్న రైతులు సొంతంగా మార్కెట్లో కూర్చుని అమ్ముకోవడానికి సమయం చాలక పోవడంతో అక్కడి టోకు వ్యాపారులకు అమ్ముతున్నారు. రైతులు మార్కెట్లో కూర్చుని అమ్ముకుందామనుకున్నా కుదరని పరిస్థితి.

నగరంలో గొలుసు చోరీల కలకలం

అనంత నేరవార్తలు: నగరంలో బంగారు గొలుసు చోరీలు కలకలం రేపాయి. నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని కోవూరునగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఆదివారం తెల్లవారుజామున తమ ఇంటి సమీపంలో పూలు కోసుకురావడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని దుండగుడు ద్విచక్ర వాహనంలో వచ్చి మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. మహిళ కేకలు వేయడంతో స్థానికులు గుమిగూడే సరికి అక్కడి నుంచి దొంగ పరారయ్యాడు. శనివారం నగరంలోని సాయినగర్ నాల్గో క్రాస్‌లో చంద్రకళ అనే మహిళ ఇంటి ముందు ముగ్గులు వేస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి ఆమె మెడలో బంగారు గొలుసును చోరీ చేయడానికి ప్రయత్నించారు. అప్రమత్తమైన మహిళ కేకలు వేయగా, స్థానికులు వెంబడించడంతో దొంగలు ద్విచక్ర వాహనంలో ఉడాయించారు.

దొంగల వేటకు ప్రత్యేక బృందాలు: అనంతపురం కోవూరునగర్, సాయినగర్‌లో చోటు చేసుకున్న చైన్‌స్నాచింగ్ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించామని అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. దొంగల ముఠా కోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపామన్నారు. నగరంలో రాత్రి, పగలు గస్తీ ప్రారంభించామన్నారు. సీసీ పుటేజీలను విశ్లేషిస్తున్నామన్నారు. శివారు ప్రాంతాల్లో నివసించే వారు వేకువజామున నిద్ర లేచి ఇంటి పరిసరాలు శుభ్రం చేసుకోవడం, ముగ్గులు పెట్టడం, తొందరగా ఎవరూ లేకుండా ఉదయం నడకకు వెళ్లరాదని డీఎస్పీ సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు లేదా డయల్ 100, 112కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న మాబు సుభాని గంధం, ఉరుసు ఉత్సవాలు మంగళవారం సాగాయి. 10 రోజులపాటు కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. హజరత్ హాఫిజ్ బాబా మౌలానా మొహమ్మద్ దస్తగిరి స్వామి జీవిత విశేషాలు తెలిపారు. 14న రాత్రి 8 గంటలకు గంధం పురవీధుల్లో ఊరేగిస్తారు.

ఉత్సాహంగా సాంస్కృతిక సంబరాలు

లెక్చరర్స్‌కాలనీ (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శిల్పారామంలో శని, ఆదివారాల్లో సాంస్కృతిక సంబరాలు ఉత్సాహంగా సాగాయి. దసరా పండగ కావడంతో సందర్శకులు వెల్లువెత్తారు. శనివారం శ్రీలలిత నాట్య కళానికేతన్ ఆధ్వర్యంలో బాలికల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బాలికలు దుర్గామాత వేషాల ప్రదర్శనతో దసరా పండగ విశిష్టతను చాటిచెప్పారు. శంకర శ్రీగిరి, ఆదిశక్తి, త్రినేత్ర సుందర, హిమగిరి తనయ, గంధం పూయరుగా, దేవి స్తుతి, శ్రీదుర్గా పాటలకు లయబద్ధంగా నృత్యాలు అద్భుతంగా చేశారు. ఆదివారం అనంతనాగ్ సంగీత స్వర్గ్ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో పాటల విభావరి ఆకట్టుకుంది. కొత్త సినిమా పాటలు, హిందీ పాటల ఆలాపనతో ప్రేక్షకులను అలరించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సంబరాల్లో నగర, గ్రామీణ సందర్శకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాలను శిల్పారామం ఏవో కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.



బిందెలపై నృత్యం చేస్తున్న బాలికలు



శివకోటి శ్రీపీఠంలో అపరాజితాదేవి అలంకారం



కొత్తూరు కన్యకాపరమేశ్వరి దేవికి బంగారు చీరతో అలంకారం



పాతూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారు



శారదానగర్‌లో గజలక్ష్మి అలంకారంలో శారదామాత



హెచ్చెల్సీ కాలనీలో ముత్యాలమ్మ

వైభవంగా విజయదశమి వేడుకలు



ఆత్మకూరులో కన్యకాపరమేశ్వరి

అనంత నగరపాలక: తొమ్మిది రోజుల పాటు శరన్నవ నవరాత్రులతో అమ్మవారిని వివిధ రూపాల్లో కొలిచారు. ముగింపు ఉత్సవాలను విజయదశమి రోజు మరింత దేదీప్యంగా నిర్వహించారు. శనివారం పండగ కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే ప్రధాన ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శివకోటి శ్రీపీఠంలో అప్పాస్వామి ఆధ్వర్యంలో శమీ వృక్ష పూజ, ఉంజల్‌సేవ, రాజోపచార పూజలు చేశారు. ఆదివారం నగరంలోని కొత్తూరు, పాతూరు అమ్మవారి శాలల్లో శయనోత్సవాలు నిర్వహించారు. **ఆత్మకూరు:** మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సనప గ్రామంలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని పెద్దఎత్తున ఊరేగించారు.



శమీ వృక్ష పూజ చేస్తున్న అప్పాస్వామి

శాంతి భద్రతల రక్షణలో రాజీపడొద్దు

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం పరిధిలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఉందని, ప్రశాంతంగా ఉండాలంటే శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీపడొద్దని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆదివారం అనంతపురంలోని తన గృహంలో కొత్త డీఎస్పీ శ్రీనివాసరావు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతపురం అర్బన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలోని సమస్యలపై చర్చించారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

'జేఎన్‌టీయూలో' మద్యం టెండర్లు వద్దు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో మద్యం టెండర్ లాటరీ ప్రక్రియ నిర్వహించడం రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయంలో మద్యం టెండర్లు నిర్వహించాలని అధికారులు తీసుకున్న నిర్ణయం సబబు కాదన్నారు. అధికారుల స్వలాభం కోసం విశ్వవిద్యాలయ కీర్తిని దిగజార్చడం దారుణమన్నారు. వేలాది మంది విద్యార్థులు ఉన్నత, సాంకేతిక విద్యను అభ్యసించే విశ్వవిద్యాలయాన్ని మద్యం టెండర్లకు ఉపయోగించుకోవడం బాధాకరమన్నారు. సాంకేతిక విద్యలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు అందుకునే జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మద్యం టెండర్లు నిర్వహించడం ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, మేధావులు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దమ్మతల్లికి బోనాల సమర్పణ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రంలో వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల ఉత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు తెల్లవారుజామునే పెద్దమ్మతల్లిని వెండి, బంగారు ఆభరణాలతో పాటు, పూలతో అలంకరణ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరుణాకర్, తెదేపా నాయకులు రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు, అశోక్, నారాయణస్వామి పూజల్లో పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న భక్తులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆజాద్‌నగర్(అనంతపురం): చితమత్తూరు సామూహిక అత్యాచార ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బతుకు దెరువు కోసం వలసొచ్చిన అభాగ్యులపై దుండగులు చేసిన దుర్మార్గానికి తగిన శాస్తి జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారంటే శిక్షలు పడవని, రాజకీయ నాయకుల అండదండలు ఉంటాయనేది కారణమని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ ఆరోపించారు. కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన దారుణం మరువక ముందే ఇలాంటి ఘటన జరగడం సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. సోషల్ మీడియాలో విచ్చలవిడిగా అశ్లీల వీడియోలు చూస్తున్నా నివారించడం లేదన్నారు.

పశువుల సంచారానికి కట్టడి ఏదీ?



అరవిందనగర్‌లో అడ్డంగా కూర్చున్న గోవులు

కమలానగర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రధాన రోడ్లలో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తు వాహనదారులను ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. పశువులను తీసుకెళ్లాలని, లేనిపక్షంలో గోశాలలకు తరలిస్తామని నగరపాలక అధికారులు అనేకమార్లు హెచ్చరికలు జారీ చేసినా పశువుల యజమానుల్లో ఏ మాత్రం మార్పు రావటం లేదు. నగరంలోని పాతూరు, తాడిపత్రి బస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, బళ్లారిరోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు, అరవిందనగర్, రెండో రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, శారదానగర్, సంఘమేశ్ సర్కిల్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ఇలా అనేక ప్రాంతాల్లో పశువులు గుంపులుగా ఉంటూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నాయి. జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే అవి ఎక్కువగా తిరుగుతున్నాయి. రాత్రిళ్లు రోడ్డుకు అడ్డంగా పడుకుంటున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పశువులను గోశాలలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సఫాయి కర్మచారుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఈశ్వరయ్య



తపోవనం(అనంత గ్రామీణం): ఆంధ్రప్రదేశ్ సఫాయి కర్మచారుల సంఘం సంయుక్త కార్యదర్శిగా ఈశ్వరయ్యను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయ ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడిగా ఉన్న ఆయన మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, గుంతకల్లు మున్సిపాల్టీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర సఫాయి కర్మచారుల సంఘం సభ్యులు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు. ఆయన ఎంపిక పట్ల పలువురు జిల్లా సఫాయి కర్మచారుల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నీరుగంటివీధిలో జాగ్రత్త



నీరుగంటివీధిలో మురుగు కాలువల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. వేణుగోపాల్‌నగర్ ఆటోస్టాండ్ నుంచి నీరుగంటివీధిలోకి వెళ్లే మార్గంలో రోడ్డుకు అడ్డంగా మురుగు కాలువ నిర్మించారు. వాహనాలు ప్రయాణించేందుకు దానిపై సిమెంట్‌స్లాబు ఏర్పాటు చేశారు. ఇది ఎత్తులో నిర్మించడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కాలువ చివర వరకూ సిమెంట్‌స్లాబు నిర్మించలేదు. రోడ్డు అంచుకు వాహనాలు వెళ్తే కిందపడాల్సిన పరిస్థితి. స్లాబు ఎత్తును తగ్గించి, కాలువ చివరి వరకూ పైకప్పు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉమానగర్

మడుగు కాదు.. రోడ్డు

కక్కలపల్లి కాలనీ టమాటా మండి వద్ద ప్రధాన రోడ్డు మడుగును తలపిస్తోంది. గుంతలు పడి నీరు నిల్వ చేరడంతో అందులో గేదెలు పొర్లుతున్నాయి. గంటల తరబడి బురద నీటిలో సేద తీరుతున్నాయి. ప్రధాన దారి కావడంతో అనంతపురం నగరంలోకి, కక్కలపల్లి, కాట్నేకాలువ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు అడ్డంగా ఉన్న గేదెలను తప్పించడానికి నానా తంటాలు పడ్డారు. వైకాపా హయాంలో ఈ రోడ్డుకు ఒక్కసారి కూడా మట్టి వేసిన దాఖలాలు లేవు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాణినగర్



చెట్టు కొమ్మలతో ఇబ్బందులు



నగరంలోని కమలానగర్ వాణిజ్య కేంద్రం. నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ రోడ్లు ఇరుకిరుకుగా ఉంటాయి. ఒక్కోసారి ఎదురెదురుగా వాహనాలు వస్తే రాకపోకలు నిలిచిపోతాయి. ఈనేపథ్యంలో రఘువీర టవర్ వెనుక వీధిలో చెట్ల కొమ్మలను నరికి రోడ్డుకు అడ్డంగా పడేశారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఒక ద్విచక్రవాహనం వెళ్లడానికి మాత్రమే మార్గం ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అనంత నగరపాలక

స్తంభం ఒరిగింది.. ముప్పు పొంచి ఉంది..

అనంతపురం గ్రామీణ మండలం కందుకూరుకు వెళ్లే దారిలో ఓ రైతు పొలంలో విద్యుత్తు నియంత్రిక అమర్చిన స్తంభం పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ప్రస్తుతం భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో స్తంభం ఎప్పుడు కూలుతుందోనని రైతు ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్యను అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. సకాలంలో స్పందించి స్తంభాన్ని సరి చేయాలని కోరారు. - న్యూస్‌టుడే, రాప్తాడు



ప్రమాదకరంగా వంతెన



ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తిరోడ్డుకు వెళ్లే ఎన్టీఆర్ మార్గ్‌లో మరువ వంకపై దశాబ్దం కిందట చిన్న వంతెన నిర్మించారు. రోడ్డు మధ్యలో డివైడర్‌కు ఇరువైపులా వంతెన కుంగిపోతోంది. ఎలాంటి రక్షణగోడ లేదు. వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వంకలో పడే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతంలో రాత్రిళ్లు వంతెన కనిపించదని, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వేణుగోపాల్‌నగర్

బాస్కెట్‌బాల్ పోటీల విజేత తూర్పుగోదావరి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో రన్నర్స్‌గా అనంతపురం, మూడో స్థానంలో విశాఖపట్నం, గుంటూరు జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్స్‌గా కృష్ణా జట్టు, మూడో స్థానంలో చిత్తూరు, గుంటూరు జట్లు నిలిచాయని బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తన తండ్రి జీఎంసీ బాలయోగి పేరిట అమలాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ స్టేడియంను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామచంద్రపురంలో రెండో సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును అభివృద్ధి చేసేందుకు నిధులు ఇస్తామన్నారు. తొలుత మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, గన్నమని చక్రవర్తి, ప్రముఖ డాక్టర్లు చెలికాని రామారావు, కోట సతీష్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపీ హరీష్‌మాధుర్‌ను ఘనంగా సత్కరించారు. జిల్లా, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బాలుర విభాగంలో రన్నర్స్‌గా నిలిచిన అనంత జట్టు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండల కేంద్రంలో గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడిన లక్ష్మీనారాయణ(40) అనంతపురంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. అయ్యవారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణ పాలచర్ల గ్రామంలో నివాసం ఉంటూ సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగించేవారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హెచ్చెల్సీ నీటికి రైతుల వాగ్వాదం

నార్పల, న్యూస్‌టుడే : సాగు నీటి కోసం కూరగానిపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాల రైతులు పరస్పరం వాగ్వాదానికి దిగారు. ఇటీవల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చొరవతో హెచ్చెల్సీ కాలవకు ఇటీవల అధికారులు నీరు వదిలారు. శనివారం రాత్రి 28వ ఆయకట్టు కాలువ దగ్గర కూరగానిపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాల రైతులు సాగునీటి విషయంలో వాగ్వాదానికి దిగారు. కాలువ దగ్గరే భైఠాయించి వాదనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ కౌలుట్లయ్య ఆదేశాల మేరకు నార్పల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నీరు వంతుల వారీగా వాడుకోవాలని సూచించి అక్కడి నుంచి రైతులను ఇళ్లకు పంపేశారు. సాగునీటి పంపకాల విషయంలో మూడు గ్రామాల రైతుల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉన్నందున నీటిపారుదలశాఖ అధికారులు వివాదాన్ని పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

● మూడ్రోజుల తర్వాత వెలుగులోకి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఒకటో పట్టణ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. రమణమ్మ, నాగేంద్రప్రసాద్‌లు నగరంలోని బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలకు సమీపంలో నివశిస్తున్నారు. వీరికి కుమారుడు సంతోష్‌కుమార్ (21), కుమార్తెలు ఉన్నారు. కుమారుడు కమలానగర్‌లో చరవాణి మరమ్మతుల దుకాణంలో పనిచేసేవాడు. నాగేంద్రప్రసాద్ ఈ ఏడాది జనవరిలో గుండెపోటుతో మృతి చెందారు. అతని కుమార్తెకు ఇటీవల వివాహమైంది. తండ్రి మృతి చెందడం, చెల్లెలు వివాహం చేసుకుని వెళ్లిపోవడంతో సంతోష్‌కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. గత గురువారం ఇంట్లోని పైఅంతస్తు గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజులైనా కుమారుడు గది నుంచి బయటకు రాకపోవడంతో భయపడిన తల్లి తలుపులు పగులగొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.